# ముసుగు

సికిందరాబాదు బయల్దేరింది బంధువుల్ని కలుసుకునేందుకే అయినప్పటికీ ట్రయిన్లో కూర్చున్న నా ఆలోచనలనిండా వనిత ఉంది.

వనిత నా స్నేహితురాలు. గ్రాడ్యుయేషన్లో మూడేళ్ళు కలిసి మెలిసి ఉన్నాం. దాని అభిప్రాయాలు నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తూండేవి. అందరూ కబుర్లలో చెప్పేది అది ఆచరణలో చేసేది.

వనిత కలవారి అమ్మాయి. అయితే ఎప్పుడూ నేత చీరలు తప్పకట్టేదికాదు. అందుకు తను చెప్పిన కారణం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. సింథటిక్ బట్టలన్నింటికీ పెట్రోలు మూలపదార్థమట. మన దేశంలో పెట్రోలు అవసరానికి సరిపడ దొరకక్క విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నామట. ఎగుమతుల ద్వారా సంపాదించిన విదేశీ మారకద్రవ్యంలో చాలావంతు పెట్రోలు గురించే ఖర్చవుతున్నదట. పెట్రోలును ఇంధనంగా వాడడం ఎలాగూ తప్పదు. కానీ బట్టలకు వాడడం ఎందుకు ?

"నువ్వొక త్తివి మానేస్తే సరిపోతుందా? దేశంలో అంతా టెర్లిన్సు, నైలాన్సు, పోలీస్టర్సు కడుతున్నారు—" అని నేననగా "నాది ఉడతా భక్తి!" అంది వనిత.

అంతేకాదు. తను నేతబట్టలు ధరించడం ద్వారా స్వదేశీ పరిశ్రమల్ని ప్రోత్సహిస్తున్నదట.

వనిత డబ్బు వృథా చేసేదికాదు. కాలేజీలో ఖర్చులకని రోజూ దానికి రెండు రూపాయలు ఇచ్చేవారు ఇంట్లో. తను ఎక్కువగా చిరుతిళ్ళు, సినిమాలజోలికి వెళ్ళేదికాదు. ఆ డబ్బును పోగుచేసి వెతుక్కుంటూ వెళ్ళి మరీ పేదవిద్యార్థులకు సాయం చేసేది. ఫీజుకట్టడమో, పుస్తకాలకని ఇవ్వడమో చేసేది తప్పితే ఎవరికీ డబ్బు ఇచ్చేది కాదు.

"మన దేశంలో ప్రజల మనస్తత్వమెలాంటిదంటే నాలుగు రోజుల్నించి తిండి లేనివాడి మీద జాలిపడి నాలుగు డబ్బులిస్తే వాడు కొనప్రాణంతో కూడా ఆ డబ్బులెట్టి సినిమా చూసి హాల్లోనే ప్రాణాలు విడుస్తాడు. డబ్బును దుర్వినియోగం చేయడం మన దేశంలో అందరికీ బాగా అభ్యాసం అయింది. అందుకని వాళ్ళకు సాయపడాలనుకుంటే వాళ్ళ అవసరాలేమిటో తెలుసుకుని అవి తీర్చాలి కానీ డబ్బివ్వకూడదు—" అనేది వనిత.


అయితే వనిత ఎవ్వరడిగినా చందాలు మాత్రం ఇచ్చేదికాదు. చందాలు వసూలు చేసేవాళ్ళంటే దానికి బాగా చిరాకు. అదొక వ్యాపారంగా మారిపోయిందని విసుక్కునేది. స్వచ్ఛంద సేవాసంస్థల మీద కూడా దానికి గౌరవభావం లేదు. కొందరు వ్యక్తులు పదిమందిలో గుర్తింపుకోసం మాత్రమే అలాంటి సేవాసంస్థలు నిర్వహిస్తున్నారు తప్పితే ప్రజల కష్టాలు చూసి చలించి మాత్రం కాదు.

వనితకు అన్ని విషయాల్లోనూ నిర్దుష్టమైన అభిప్రాయాలుండేవి. అన్నీ సరైనవని చెప్పలేను కానీ దానిది జాలిగుండె అని మాత్రం చెప్పగలను. దానికి మహాత్ములకుండేలాంటి ప్రేమించే హృదయం ఉంది. అప్పట్లో నేను అనుకుంటూ ఉండేదాన్ని—దీన్ని వివాహం చేసుకున్నవాడు చాలా సుఖపడతాడని! ఎందుకంటే — బయటవాళ్ళనే ఇంతగా ప్రేమించే వనిత—భర్తను ఇంకా బాగా ప్రేమించగల్గుతుంది!

భగవంతుడు భక్తులనే పరీక్షలెక్కువపెడతాడంటారు. మానవసేవయే మాధవసేవ అన్నారు కాబట్టి వనిత గొప్ప భక్తురాలేనని నా అభిప్రాయం. పెళ్ళి విషయంలో భగవంతుడు దాన్ని పరీక్షించి-అది భక్తురాలన్న విషయం ఋజువుచేశాడు.

ఫైనలియర్లో ఉండగా కాబోలు వనిత తన ప్రేమ గురించి చెప్పింది. చెప్పిన రెండు రోజులకు అతన్ని చూపించింది.

అతడి పేరు మాధవరావు. ఎర్రగా బుర్రగా ఉన్నాడు. మనిషి మరీ డబ్బున్నవాడు కాకపోయినా ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు, వనిత ఊళ్ళోని లైబ్రరీలో ఒకే పుస్తకం కోసం అడిగినప్పుడు ఒకరికొకరు పరిచయం అయ్యారు. క్రమంగా ఇద్దరి అభిరుచులూ ఒక్కటే



— జొన్నలగడ్డ రామలక్ష్మి

నని తెలిసింది.

"నాలాంటి ఆలోచనలే ఉన్న మగాడుంటాడనీ-ఉన్నా అతడు నాకు పరిచయమవుతాడనీ-పరిచయమైనా అతణ్ణి నా జీవితంలోకి ఆహ్వానించే అవకాశం వస్తుందనీ నేనెప్పుడూ అనుకోలేదు. ఇది నాకెంతో సంతోషంగా ఉంది—" అంది వనిత.

దాని కళ్ళలో మెరుపుచూసి అది చాలా ఘాఢమైన ప్రేమలోనే పడిందని గ్రహించాను. అయితే ఇన్నాళ్ళకు వనితకు నేనూ ఏదైనా చెప్పే అవకాశం వచ్చింది. నచ్చిన ఆడపిల్లను మచ్చిక చేసుకోవడం కోసం ఏ మగాడైనాసరే పెళ్ళికి ముందు ఆమె అభిప్రాయాలే తన అభిప్రాయాలంటాడు. ఆమె ఏమన్నా అంగీకరిస్తాడు. అతడి అసలు స్వరూపం బైటపడేది పెళ్ళికి తర్వాతనే!

వనిత నా మాటలు విని నవ్వింది. మనుషుల్ని అంచనా వేయడంలో తనెప్పుడూ పొరబడనంది. మాధవరావు అందరు మగాళ్ళ లాంటివాడూ కాదని అంది.

ప్రేమమైకంలో ఉన్న ఏ ఆడపిల్లయినా అలాగే అనుకుంటుంది. అందులో ఆశ్చర్యమేమీ లేదు. వనిత అనుకున్నదే నిజం కావాలని నేను మనసారా కోరుకున్నాను.

వనిత తెలివైనది. ప్రేమమైకంలో అది తప్పేమీ చెయ్యలేదు. మాధవరావు గురించి ఇంట్లో చెప్పేసింది. దాని మీద ఇంట్లో కాస్త రభస కూడా జరిగిందిట. కానీ వనిత పట్టుదల వదలలేదు. మాధవరావుతో వివాహం పెద్దలు జరుపకపోతే తనే జరుపుకోవలసి ఉంటుందని హెచ్చరించింది. ఆఖరికి ఇంట్లో ఒప్పుకున్నారు. ఆ విషయం వనిత నాకు ఎంతో సంతోషంగా చెప్పుకుంది.

"ఇంట్లో వాళ్ళు ఒప్పుకుంటేనేం, ఒప్పుకోకపోతేనేం? ఎలాగూ నువ్వతన్ని పెళ్ళి చేసుకోదలిచావుకదా – దీనికింత సంతోషమెందుకూ?" అనడిగాను.

"చిన్నప్పట్నించీ పెరిగిన వాతావరణానికి దూరం చేసేది పెళ్ళి. అది భరించడం నాకు పెద్ద కష్టం కాదు. కానీ చిన్నప్పట్నించీ పెంచిన మనసులకు కూడా పెళ్ళి నన్ను దూరం చేస్తే అది భరించడం కష్టమేగదా! అందుకే నాకు సంతోషం" అంది వనిత.

అది నిజమేననిపించింది. అందుకే నేనూ సంతోషించాను.

ఆ తర్వాతే జరుగకూడని ఘోరం జరిగిపోయింది.

ఫైనల్ పరీక్షలు రాసిన పది రోజులకు మాధవరావు స్కూటర్ మీద వెడుతూ యాక్సిడెంట్ చేసి హాస్పిటల్ పాలయ్యాడు. అతణ్ణి చూడ్డానికి నేనూ వెళ్ళాను.

మాధవరావు దురదృష్టం. అతడికి రెండు కాళ్ళూ పోయాయి. కాస్త పరిచయమైనవారెవరు కనబడినా అతను ఏడ్చేస్తున్నాడు. నన్ను చూసి కూడా ఏడ్చాడు.

నాకు నిజంగా జాలివేసింది. మాధవరావు గతేమిటి? ఈ పరిస్థితిలో కొంత కాంపెన్సేషన్ ఇచ్చి అతడి ఉద్యోగం కూడా పీకేస్తారని తెలిసింది.

ఏది ఏమైనప్పటికీ వనిత చాలా అదృష్టవంతురాలు. ఇదే యాక్సిడెంట్ వివాహానికి తర్వాత జరిగి ఉంటే దాని నూరేళ్ళ జీవితం నాశనమై ఉండేది. అదే చెప్పి దానిని అభినందించాను. వనిత అదోలా నా వంక చూసి—"మాధవరావును నేను ప్రేమించానని నీకు తెలుసుగదా—" అంది.

"తెలుసు. కాని కాళ్ళు పోయినవాణ్ణి పెళ్ళి చేసుకునే దుర్గతి నీకు పట్టదనీ తెలుసు—" అన్నాను.

"ప్రేమంటే నీకు తెలుసా?" అంది వనిత.

ఒక్క క్షణం ఆశ్చర్యంగా దానివంక చూసి—"నువ్వు చెప్పు. వింటాను—" అన్నాను.

"ప్రేమ కాంక్షించేది భౌతిక శరీరాన్ని కాదు. అది రెండు మనసుల కలయిక. యాక్సిడెంటుకు ముందూ, ఇప్పుడూ అతడి మనసులో మార్పేమీ లేదు. దాని మంచితనం పోలేదు. అలాంటప్పుడు నేనామనసును ఎలా వదులుకుంటాను? అదీకాక మాధవరావు మంచిమనసు ఇప్పుడు దిగులుగా వుంది. ఇలాంటప్పుడు ధైర్యం చెప్పలేకపోతే మా ప్రేమకు అర్థం లేదు. ఈ పరిస్థితుల్లో నేనతణ్ణి కాదంటే మానసికంగా అతడెంతగానో కృంగిపోతాడు. చివరకు ఆత్మ హత్యకు పాల్పడినా ఆశ్చర్యం లేదు....అంది వనిత.

"అయితే నువ్వతణ్ణి పెళ్ళి చేసుకుంటావా?', ఆశ్చర్యంగా అడిగాను.

"ఆఁ" అంది వనిత. అలాగన్నప్పుడు దాని ముఖంలో విచారం గానీ, త్యాగం చేస్తున్నానన్న భావం గానీ నాకు కనబడలేదు. ఎప్పటిలాగే మాట్లాడింది.

అయితే అసలు విషయం నేను అర్థం చేసుకోగలిగాను.

వనిత మాధవరావును ప్రేమించింది. అందుకు కారణం అతడిలోని ఔన్నత్యమని నేననుకోను. ఒక కన్నెపిల్లగా అది అతడిపట్ల ఆకర్షించబడింది. అంతేతో ప్రేమ కబుర్లు చెప్పింది. అది చెప్పే ప్రేమ అన్న పదానికి అర్థం లేదు. సంవత్సరాల సాహచర్యంలో ఏర్పడేదే ప్రేమ అని నా నమ్మకం అతడికి యాక్సిడెంట్ కాగానే వనిత మనసులో ప్రేమ స్థానే జాలి ఉద్భవించింది. అతడి నెవరు ఆదుకుంటారు? ముమ్ముందు అతడి జీవితమెలా వుంటుంది? తను కాదంటే అతడేమైపోతాడు?.... ఇలాంటి ఆలోచనలే దాన్ని మాధవరావుతో పెళ్ళికి ప్రోత్సహిస్తున్నాయి. ఒక స్నేహితురాలిగా నేనిది సాగనివ్వరాదు.

వనితకు నేను ఎన్నో విధాలా నచ్చజెప్పాలని ప్రయత్నించాను. అవసర మనుకుంటే అతణ్ణి పోషించే ఏర్పాటు కూడా చెయ్యవచ్చు నని సూచించాను.

కానీ వనిత నా మాటల్ని కొట్టి పారేసింది.... "నాతో పెళ్ళి గురించి అతడు కలలు కన్నాడు. పెళ్ళికి ముందే కాళ్ళు పోయాయి. ఆ కాళ్ళ కారణంగానే పెళ్ళి కూడా చెడిపోయిందని అతడనుకోరాదు. జీవితాంతం అతడికి ఊతగా వుంటాను. అతడికి జీవితంపై మమకారం పుట్టిస్తాను. పెళ్ళి ఒక్కటే అందుకు మార్గం. ఈ పరిస్థితుల్లో అతణ్ణి వదిలిపెట్టడమంతే అమానుషం వేరే వుండదు. అలాంటి అమానుషం నావల్ల కాదు...."

వనిత యింట్లో దీనిపై పెద్ద గొడవ జరిగింది. ఈ పెళ్ళి జరిగితే మళ్ళీ వనిత ముఖం చూడనన్నాడు వనిత తండ్రి. అయినా వనిత లెక్క చేయలేదు.

నేను వనిత తల్లితో మాట్లాడాను. ఆవిడ ఎవరో పోయినట్లుగా ఏడ్చి – "ఈ పెళ్ళి ఎలా ఆపాలో నాకు తెలియడం లేదమ్మా, ఎంత బెదిరించినా అది లొంగడం లేదు–" అంది.

పరీక్షలు ప్యాసైన ఆర్నెల్లకే వనితకు సికిందరాబాదులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిన రెండు నెలలకే అది మాధవరావుని పెళ్ళి చేసుకుంది. ఆ పెళ్ళి కారణంగా దానికి

తలిదండ్రులతో సంబంధం చెడిపోయింది.

నేను వనిత తల్లిని కలుసుకుని "ఎక్కడో ఎవరికో తప్ప సాధ్యం కాని మహాకార్యం మీ అమ్మాయి చేసింది. ఇప్పుడామెకు నా అన్నవాళ్ళ మాటసాయం అవసరం. మీ రామెను వదిలేస్తే ఎలా?" అనడిగాను.

"యింట్లోంచి పొమ్మంటే లొంగి వస్తుందేమో నని ఆశపడ్డాం. కఠినంగా వుంటే ఈ పెళ్ళి ఆగక పోదా అనుకున్నాం. ఏదీ జరగలేదు. మాకు మాత్రం దానిమీద కక్ష వున్నదా – మళ్ళీ అంతా కలిసుండడం తప్పదు" అందావిడ.

ఆవిడ చెప్పిందీ నిజమే – ఎవరి బాధ వారిది. వనితను అదుపు చేయాలన్న ఆశతో వారలా కఠినంగా ప్రవర్తించారు. తప్పితే కన్న తల్లిదండ్రులకు ఆమెపై కక్ష ఎందుకుంటుంది?

వనిత మాధవరావుతో కాపురం చేస్తోంది. తలిదండ్రులతో గొడవలూ లేవామెకు.

పెళ్ళైన కొత్తలో ఓ సారి నేను వనిత ఇంటికి వెళ్ళి వచ్చాను. అత్తవారు కట్నంగా అతడికి చక్రాల కుర్చీ ఇచ్చారనట్లు–అతడందులో తిరుగుతున్నాడు. అతడెంతో సంతోషంగా వున్నాడు. వనిత ముఖంలో నాకెక్కడా విషాదఛాయలు కనిపించ లేదు. వారిద్దరి దాంపత్యం జీవితం ఎంతో చక్కగా కనపడుతున్నట్లు నాకు తోచింది.

వనితను ఏకాంతంలో అడిగాను. "నీకిలా బాగుందా?" అని.

"అతణ్ణి చూడవే! కలకాలం అతడి ముఖంలో ఆ సంతోషం చూడడం కోసం నేను ఏమైనా చేయగలను. అతడి సంతోషం కేవలం నాకారణంగా కలిగినదంటే అది నాకెంతో తృప్తి!" అంది వనిత.

నేను మాధవరావుని వనిత గురించి అడిగాను.

"ఆమె దేవత...." అన్నాడతను.

ఆ క్షణంలో అతడి కళ్ళలో కనబడిన మెరుపు చూస్తూంటే నేనూ వనితలాగే ఇలాంటి పెళ్ళి చేసుకోవాలనిపించింది. త్యాగంలో కూడా ఎంత తృప్తి, సంతోషం ఉన్నాయి?

"ఇందులో త్యాగమేముంది?" అంది వనిత– "అందరిలాగే నేనూ పెళ్ళి చేసుకున్నాను. నా భర్తకు కాళ్ళులేవు. కాళ్ళు లేని కారణంగా అతడు మనిషికాకుండా పోతాడా?"

నేను దాని మాటలు వినలేదు. అది చేసింది త్యాగం కాకపోతే – త్యాగమన్న పదాన్ని ఎలా నిర్వచించాలో నాకు తెలియకుండా పోతుంది.

ఆ తర్వాత నా వివాహమూ జరిగిపోయింది. నేను వనితలా వికలాంగుణ్ణి చేసుకోలేదు. ఆయనకు అందం, పర్సనాలిటీ అన్నీ ఉన్నాయి. వివాహమైన సంవత్సరంలోనే నాకు మగాడంటే తెలిసిపోయింది.

ఇది పురుషప్రపంచం. భార్యభర్తకు సాయపడితే అది విధి అనిపించుకుంటుంది. భర్త భార్యకు సాయపడితే అదీ ఔదార్యం అనిపించుకుంటుంది. పేరుకు మాత్రమే భార్యాభర్తలు సరిసమానులు తప్పితే అన్నింటా మగవాడి ఆధిపత్యమే చెల్లుతుంది. భర్త భార్యను శాసిస్తాడు. తను ఏం సాధించాలనుకున్నా భార్య భర్తను ప్రాధేయపడాలి. పెళ్ళి కాగానే ఇంటి పేరు మారడమేకాదు - తన ఇంటివాళ్ళంతా పరాయివాళ్ళైపోతారు భార్యకు.

నా భర్త మంచివాడే కానీ మా జీవితంలో నాకు రవంత అసంతృప్తికనబడింది. అప్పుడప్పుడు ఆయనతో వాదించేదాన్ని. ఒకోసారి తిరగబడేదాన్ని. ఆ కారణంగా మా సంసారంలో తరచుగా కలతలు వస్తూండేవి.

"నేను మిమ్మల్ని కట్నమిచ్చి కొనుక్కున్నాను. మీరాఫీసులో కష్టపడితే నేను ఇల్లు తీర్చి దిద్దడంలో కష్టపడుతున్నాను. మీరు డబ్బు సంపాదిస్తూంటే నేను ఆ డబ్బుకు సార్థకత కల్పిస్తున్నాను. ఇందులో మీ ఎక్కువేమిటి? నా తక్కువేమిటి? ఈ యింట్లో నా మాటకు ఎందుకు చెల్లుబడి ఉండదు?" అన్నది నా బాధ.

"నేను మగాణ్ణి. డబ్బు సంపాదించేవాణ్ణి. సహజంగా నాకు సహనం తక్కువ. అది అర్థం చేసుకుని నువ్వు భార్యగా నాకు సహకరించాలి. నీ ఓర్పులో నువ్వు నా ఆధిక్యతను సహించాలి. నీక్కావలసింది నేర్పుతో నన్ను మెప్పించి సాధించాలి. అదీ ఆడలక్షణం—" అన్నది ఆయన భావం.

అలా ఓసారి గొడవపడి ఇద్దరం రెండ్రోజులు మాట్లాడుకోలేదు. అప్పుడే నాకు సికిందరాబాదు నుంచి ఓ స్నేహితురాలు వనిత గురించి ఉత్తరం రాసింది.

వనిత భర్తకు కృత్రిమంగా కాళ్ళు పెట్టారుట. చంకలో కర్రలతో కొన్నాళ్ళు బయట నడిచేవాడట. కానీ ఇప్పుడతను బైట కూడా పూర్తిగా భార్య ఊత మీద నేనడుస్తున్నాడట. అతడామె భుజాల మీద తన చేతులతో బరువాల్చి భారంగా అడుగులు వేసే దృశ్యం–సికిందరాబాదు వీధుల్లో చాలామంది చూసి ప్రత్యేకంగా చెప్పుకుంటున్నారుట. వనిత పేరు మార్మోగిపోతోందట. ఆదర్శ గృహిణిగా ఆమె గురించి చాలామంది చెప్పుకుంటారుట.

ఈ వివరాలు చదివి నేను చాలా ఆశ్చర్యపడ్డాను. అసలైన ఇల్లాలు వనిత. కాళ్ళు లేని భర్తను నిలబెట్టి నడిపించడానికి కర్రలస్థానంలో తను నిలబడింది. ఎంత అద్భుతమైన విషయమిది!

ఈ విషయం గ్రహించగానే నాకు కనువిప్పయింది. తను చేసింది త్యాగంగా భావించలేదు వనిత. ఒక మనిషిని మనిషిగా నిలబెట్టడం కోసం స్వసుఖాలన్నీ వదిలిపెట్టి అందులోనే అంతులేని తృప్తి అనుభవిస్తోంది. ఆ తృప్తిముందు స్వసుఖాలెంత?

నేను మాత్రం నా భర్తతో ప్రతి విషయానికీ ఎందుకు దెబ్బలాడాలి? భార్యాభర్తలతో ఒకరు సరిపెట్టుకుపోతే వచ్చే నష్టమేముంది? తప్పు ఆయనదైనా, నాదైనా–నలుగురిలోనూ రొష్టుపడితే– అంతా చెప్పుకునేది మా సంసారం గురించే కానీ మా గురించి విడివిడిగా చెప్పుకోరుకదా! రేపు నాకు పిల్లలు పుట్టుకువస్తే–వాళ్ళు మా పిల్లలే కాదు కానీ–ప్రత్యేకంగా తండ్రికో, తల్లికో చెందరుగదా! వికలాంగుడైన భర్త తృప్తి కోసం అంతగా పాటుబడే వనిత నుంచి నేను నేర్చుకున్నదేమిటి?

వెంటనే నేను నన్ను సంస్కరించుకోవడానికి ప్రయత్నాలు ఆరంభించాను. ఆదిలో కష్టమే అనిపించింది. అయితే నేను లొంగి వచ్చినప్పుడల్లా ఆయనకు అంతులేని సంతోషం కలగడం గమనించాను. ఆ సంతోషం నాపట్ల అభిమానంగా మారడమూ గమనించాను. ఆ అభిమానంతో ఆయన తను కాదన్న విషయాన్నే చివరకు చేయడమూ చూశాను. అనగా – దెబ్బలాడి సాధించలేనిది మంచి మాటలలో సాధించానన్నమాట!

మగవాడు అహంకారి! అతడికి యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం లేదు. న్యాయాన్యాయాల ప్రసక్తి లేదు. భార్య తనేమంటే దానికి తల ఊపాలి. అప్పుడే అతడు భార్య మాటను వింటాడు. ఇది నాకు కాస్త బాధే అనిపించింది. ఆడది ఇలాంటి పరిస్థితి నుంచి ఎప్పటికి బయటపడుతుంది? భార్యకు ఆత్మ గౌరవంతో బ్రతికే అవకాశం ఏనాటికి

లభిస్తుంది ?

ఏది ఏమైనా నా సంసార జీవితంలో ఇప్పుడు మార్పు వచ్చింది. ఆయనకు నాపై ప్రేమాభిమానాలు పెరిగి పోయాయి. నా కారణంగా ఆయన తృప్తిగా వుంటూంటే – అది నాకూ తృప్తిని కలిగిస్తోంది. అయితే నేను ఆత్మాభిమానాన్ని క్రమంగా కోల్పోతున్నానన్న నిజం నన్ను బాధిస్తోంది.

ఈ పరిస్థితుల్లో సికిందరాబాదు ప్రయాణం వచ్చింది. ఆయనకు నెల్లాళ్ళు బొంబాయి టూరు పడింది. సికిందరాబాదులో మా అన్నయ్య కొడుక్కు అదే టయింలో బారసాల. అందుకే బయల్దేరాను. వనిత కాపురం చూడాలన్నదే నా కోరిక. అన్నీ సక్రమంగా ఉన్న భర్తతో కాపురం చేస్తూనే నేనింత దిగులుగా ఉన్నాను. మరి వనిత ఎలా వుందో ?

నిజానికి వనితకు ఎటువంటి సమస్యా భర్త పరంగా ఉండరాదు. మాధవరావు పూర్తిగా అసహాయుడు. పూర్తిగా భార్య మీదనే ఆధారపడ్డ వాడు. అలాంటి వాడికి మనస్ఫూర్తిగా సేవలు చేసే భార్య ఉంటే ఆ అదృష్టానికి పొంగిపోయి ఆమె పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలి.

అయితే నా భర్తతో కాపురం చూశాను. నాకు మగవాళ్ళ మీద సదభిప్రాయం పోయింది. అందరు మగాళ్ళకు ఉండేలాంటి అహంకారమే మాధవరావుకూ ఉండాలి. తన అసహాయతను ఉక్రోషంగా మార్చుకుంటాడతను. భార్య తనను చిన్నబుచ్చుతుందేమోనన్న అనుమానం, శీలవతిగా ఉంటోందా అన్న బెంగ కలిసి రాగా సూదిపోటు మాటలతో భార్యను వేధిస్తారు. నాలాంటిదైతే ఫరవాలేదు. మాటకి మాట చెప్పి-బుద్ధిగా ఉండని పక్షంలో వదిలేస్తానని బెదిరిస్తుంది. అప్పుడు చచ్చినట్లు పడి వుంటాడు. కానీ వనిత అలా కాదు. ఇరవైనాలుగు గంటలూ అతడి మనసును ఉల్లాసంగా ఉంచడానికి ప్రయత్నిస్తుంది. ఆమె అణకువగా ఉన్నకొద్దీ అతడు రెచ్చిపోతాడు. ఫలితంగా జీవితం ఆమెకు నరకమే అవుతుంది.

వనిత గురించి నేను చాలా విన్నాను. ఇంట్లో పనిమనుషులు లేరు. అన్నిపనులూ అదే స్వయంగా చేస్తుంది. భర్తకు స్వయంగా సేవలు చేసుకుంటుంది. అన్నీ చేసి ఆఫీసుకు వెడుతుంది. ఆఫీసుకు తప్ప అతడు లేకుండా బయటకు ఎక్కడకూ వెళ్ళదు.

వీటి గురించి నా అనుమానమేమిటంటే వనితకు తన భర్తవల్ల పడే కష్టాలు పరాయివాళ్ళకు తెలియడం ఇష్టంలేదు. అందుకే పనిమనిషిని పెట్టుకోలేదు. మాధవరావుకు ఏముంది-దాన్ని పని వాళ్ళ ఎదురుగా కూడా తిట్టవచ్చును. అలాగే అతడికి దాని ప్రవర్తన మీద అనుమానం. గతిలేక ఆఫీసుకు వెళ్ళనిస్తున్నాడు. మిగతా సమయాల్లో ఆమెను వదిలిపెట్టడు. చేయూతకు కర్రలకు బదులు భార్యనే ఉపయోగించుకోవడం-మగాడిలో అనాదిగా దాగివున్న హింసాప్రవృత్తి కారణం !

సికిందరాబాదు చేరాక నా ఈ ఆలోచనలన్నీ మా స్నేహితురాలింటికెళ్ళినపుడు బైట పెట్టాను.

"మాధవరావు అలాంటివాడు కాదు. వనితను చేపట్టినవాడు నువ్వూహించినట్లుండలేదు. ఆమె మనిషి కాదు. దేవత...." అంది స్నేహితురాలు.

ఒకరోజు వనిత ఇంటికని బయల్దేరాను. వాళ్ళిల్లు తాళం పెట్టి వుంది. తిరుగుముఖం పట్టిన సమయానికి భార్యాభర్తలు నాకు ఎదురయ్యారు.

ఆ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంది.

మాధవరావు వనిత భుజాల మీద చేయి బలంగా ఆన్చి భారంగా అడుగులు వేస్తున్నాడు. అతడి భారాన్ని మోసే వనిత నిజంగా దేవతలాగే ఉంది. చూడగానే నాకు మాధవరావు కూడా చేతికర్ర ఉంటే-ఇంతకంటే సులభంగా ఉండేదనిపించింది.

నన్ను చూడగానే దంపతులిద్దరూ ఆప్యాయంగా పలకరించారు. ముగ్గురం వాళ్ళింట్లోకి ప్రవేశించాము

కులాసాగా కబుర్లు నడిచాయి. అక్కడ సంభాషణ జరిగిన కాసేపటిలోనూ వనిత వైవాహిక జీవితం గురించి నా అంచనాలన్నీ తప్పని బుజువై పోయింది. వాళ్ళిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉన్నారు. మాధవరావు వనితను ఎన్నోవిధాల పొగిడితే వనిత మరిన్ని విధాలుగా మాధవరావును పొగిడింది.

తర్వాత నేను వనితతో కాసేపు ఏకాంతంగా మాట్లాడి దాని అదృష్టాన్నభినందించాను. "వనితా! మగాళ్ళకు అహంకారం ఎక్కువని నా అభిప్రాయం. కానీ నీ కాపురం చూశాక నా అభిప్రాయం మారింది. వాళ్ళు వికలాంగులైతే వారి అహంకారం నశించి మామూలుగా ఉండగల్గుతారు. ఇది వికలాంగుల సంవత్సరం. ఈ సంవత్సరానికి నీ కథ ఆదర్శంగా ఉండగలదు. చదువుకుని ఉద్యోగం చేసే ప్రతి యువతీ-నీకులాగే ఓ వికలాంగుణ్ణి వివాహం చేసుకుంటే-అటు కట్నాల బెడదా తప్పుతుంది. ఇటు సంసార జీవితమూ బాగుంటుంది. ఏమంటావ్ ?"

వనిత నావంక అదోలా చూసి—"మగవాళ్ళ గురించి నీకంత ఆలోచనెందుకు ? వికలాంగుడైనా, సకలాంగుడైనా మగాడికి సమస్యలుండవు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ ఆడదే ఎప్పటికీ వికలాంగురాలు. అందం, ఐశ్వర్యం, సచ్ఛీలత - వీటిలో ఏదీ కూడా స్త్రీ వికలాంగత్వాన్ని సరిచేయలేదు. ఆలోచిస్తే నువ్వు ఈ సమస్య గురించి ఆలోచించు-" అంది.

దాని మాటలు నాకంత బాగా అర్థం కాలేదు. తన భర్తను వికలాంగుడన్నందుకు దానికి కోపం వచ్చిందని గ్రహించాను. అవును-వనిత వంటి భార్య ఉండగా మాధవరావు వికలాంగుడెందుకౌతాడు ?

నేను నవ్వి-"చిన్నప్పట్నించీ నీకు మానవసేవ ఇష్టం. మాధవరావు దొరికేదాకా మానవ సేవచేసి సంతృప్తి పడ్డావు. ఇప్పుడు సరాసరి రోజూ మాధవసేవే చేస్తున్నావు. దీనికి మంచి ఫలితమే ఉంటుందిలే!" అన్నాను.

వనిత మాట్లాడకుండా నవ్వి ఊరుకుంది.

నేను మళ్ళీ అన్నాను-"ఎంత మాధవసేవాపరురాలవైనా నీ భర్త అలా నీ భుజాలమీద ఆనుకుని నడుస్తూంటే ఎబ్బెట్టుగా అనిపించడం లేదూ ? ఓ చేతికర్రతో పోయేదానికి నీకంత శ్రమ దేనికి ? మీ ఆయన ఈ మాత్రానికి ఒప్పుకోడా ?"

"ఇందులో ఆయన అభ్యంతరమేమీ లేదు. అంతా నా పట్టుదలే!" అంది వనిత.

"ఆశ్చర్యంగా ఉంది. ఏం సుఖం నీకిలా ?" అన్నాను.

"నా ఆత్మీయురాలివి కాబట్టి చెబుతున్నాను. నా కథను ఆదర్శంగా తీసుకుని ప్రచారం చేయదలిచావు కాబట్టి చెబుతున్నాను. నీకు సలహాగా పనికొస్తుందని కూడా చెబుతున్నాను. బాగా గుర్తుంచుకో-ఏ భార్యకయినా సరే ఇరవైనాలుగు గంటలూ తన భర్త అందుబాటులో చేతికర్రలాంటి వస్తువుండడం మంచిది కాదు. నన్నింకేమీ అడక్కు—" అంది వనిత.

అన్నీ ఉన్న ఆడదే తప్ప-ఏమీ లేని మగాడు ఎప్పటికీ వికలాంగుడు కాడని ఇందాకా వనిత అన్న మాటల అర్థం నాకు ఇప్పటికి తెలిసింది □